క్లుప్తంగా

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అజెండాలోని 27 అంశాలపై చర్చ ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఆయా విభాగాధిపతులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

బాబూరావును పరామర్శించిన పేర్ని కిట్టు



మచిలీపట్నంరూరల్: ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకుని విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని బుద్దాలపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మంద బాబూరావును మంగళవారం మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్యం ఎలా ఉందని బాబురావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నార్త్ మండల ఇన్చార్జి మట్ట నాంచారయ్య, బుద్రపోతుపాలెం మాజీ సర్పంచ్ నట్టే ప్రసాద్, తుమ్మలచెరువు ఉప సర్పంచ్ టి.బాలకృష్ణ, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ జి. బాలజేసు, బుద్దాలపాలెం మాజీ సర్పంచ్ పి.నాగరాజు, బొల్లా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి నిత్యాన్నదానంకు రూ.10వేలు విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానంకు గుడివాడ వాస్తవ్యులు తోట దుర్గాప్రసాద్ మంగళవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. ఉదయం ఆలయానికి చేరుకున్న దుర్గాప్రసాద్ కుటుంబసభ్యులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావుకు విరాళాన్ని అందించారు. ఆలయ మర్యాదలతో దాత కుటుంబ సభ్యులను సత్కరించారు. ఆలయ అధికారి చెన్నకేశవ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన రిలే నిరాహారదీక్ష



మచిలీపట్నంటౌన్: పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు చెందిన ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం రెండో రోజు కూడా కొనసాగాయి. స్థానిక బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎస్.రాఘవరావు, రాఘవయ్య, కృష్ణమూర్తి, హనుమకొండ మెహర్‌బాబా, దాసరి శ్రీనివాసరావు దీక్షలో కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని సంఘ నాయకులు వడ్డి నాంచారయ్య, వీవీ రావు, ఎం.కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

పెదతుమ్మిడిలో చలివేంద్రం ప్రారంభం



బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి గ్రామంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మురాల వెంకటేశ్వరరావు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల అధ్యక్షుడు జె.కిరణ్‌గుప్త మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పలు గ్రామాల కూడలి అయిన తుమ్మిడి సెంటర్లో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం అభినందించతగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుమ్మడి రాజు, కరెంటు రాజు, యేకుల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నాట్యాచార్యుడు గంగాధర్‌కు ఆత్మీయ సత్కారం

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళావికాసంతోనే దేశ ప్రగతి సాధ్యమని సాహితీవేత్త డాక్టర్ ప్రభాకర్ అన్నారు. ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం నాట్యాచార్యుడు గంగాధర్‌కు ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయనీ గాయకులు మల్లాది స్వాతి, రూపశ్రీ, వెంకటేశ్వరరెడ్డి తెలుగు చిత్రగీతాలను ఆలపించారు.

మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం ఎన్నడో?

- శంకుస్థాపన చేసి తొమ్మిదేళ్లయినా అతీగతీ లేదు
- 2016లో నిర్మాణ పనులు ప్రారంభించి నిలిపివేసిన టీడీపీ పాలకులు
- నిధుల సమీకరణలో టీడీపీ నేతల వైఫల్యం
- శిథిలావస్థలో ప్రస్తుత కార్యాలయ భవనం



పునాదుల్లోనే నిలిచిపోయిన నగరపాలక సంస్థ భవన నిర్మాణం

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి తొమ్మిదేళ్లయినా ఇంతవరకు నిర్మాణం పూర్తి కాలేదు. ప్రస్తుతం ప్రధాన రహదారిలో ఉన్న పాత భవనంలోనే అధికారులు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఈ భవనం నిర్మించి వందేళ్లకు పైబడి కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో నూతన భవనం అనివార్యమైంది. 2016లో నాడు మంత్రిగా ఉన్న కొల్లు రవీంద్ర, అప్పటి ఎంపీ కొనకళ్ల నారాయణరావు మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని

నేటికి సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం శంకుస్థాపన

నగర పాలక సంస్థ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఈ నెల 30వ తేదీ బుధవారం నాటికి సరిగ్గా తొమ్మిదేళ్లు అవుతోంది. 2016 ఏప్రిల్ 30వ తేదీన పోర్టురోడ్డులోని ముస్తాఖాన్‌పేటలో ఉన్న మున్సిపల్ ట్రావలర్స్ బంగ్లా స్థలంలో మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కొనకళ్ల నారాయణరావు శంకుస్థాపన చేశారు. రూ.5 కోట్ల ప్రతిపాదనతో చేపట్టిన ఈ భవన నిర్మాణానికి తాము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు సమకూరుస్తామని కొల్లు రవీంద్ర, కొనకళ్ల భరోసా ఇచ్చారు. దీంతో మున్సిపల్ అధికారులు టెండర్లు ఫైనల్ చేయటంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పునాదుల స్థాయికి పనులు పూర్తి చేశాడు. అయితే ఈ భవన నిర్మాణానికి నిధులు సమకూర్చలేకపోవటంతో కాంట్రాక్టర్ పనులను నిలుపుచేశాడు. నాటి నుంచి ఈ పునాదులు టీడీపీ పాలకులను వెక్కిరిస్తూనే ఉన్నాయి. నాడు మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కొనకళ్ల మధ్య కొనసాగిన విభేదాల కారణంగా మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాలు రెండు పర్యాయాలు వాయిదా పడ్డాయి. చివరకు 2016 ఏప్రిల్ 30న శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి 2019 ఏప్రిల్ వరకూ మూడేళ్ల పాటు అధికారంలో ఉన్న టీడీపీ పాలకులు భవన నిర్మాణానికి నిధులు సమకూర్చడంతో విఫలం కావడంతో భవన నిర్మాణ పనులు పూర్తి చేయలేకపోయారు. ఇటీవల భవన పునాదులను పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర తమ తప్పిదాల్ని కప్పిపుచ్చి గత వైఎస్సార్ సీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగానే భవన నిర్మాణం నిలిచిపోయినట్లు ఆరోపించడం చూసి నగర ప్రజలు నవ్విపోతున్నారు.

శిథిలావస్థలో ప్రస్తుత కార్యాలయ భవనం

ప్రస్తుత మున్సిపల్ కార్యాలయం నిర్మించి వందేళ్లకు పైగానే అవుతోంది. దీంతో ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు శ్లాబులు, గోడలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. శ్లాబుల పెచ్చులు ఊడిపోతున్నాయి. వీటికి మరమ్మతులు చేసినా మళ్లీ పెచ్చులు ఊడిపోతూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది భయాందోళనలతో విధులు నిర్వహిస్తున్నారు. శ్లాబు పెచ్చులు ఎప్పుడు ఊడి మీద పడతాయోనని భయాందోళనలకు గురవుతున్నారు. వర్షాకాలమైతే వర్షం కురిసిన ప్రతి సారీ శ్లాబు నుంచి వర్షం నీరు కారుతుండటంతో విలువైన ఫైల్స్ ఎక్కడ తడుస్తాయోననే భయంతో వాటిని భద్రపరిచేందుకు ఇబ్బంది పడుతుండటం పరిపాటిగా మారింది. నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన టీడీపీ పాలకులు మళ్లీ ఇప్పుడు వారే అధికారంలో ఉన్నందున నిధులు సమకూర్చి అధునాతన హంగులతో కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని నగర ప్రజలు కోరుతున్నారు.



ప్రస్తుత మున్సిపల్ కార్యాలయ భవన శ్లాబు పెచ్చులు ఊడుతున్న దృశ్యం

ఘనంగా కాగిత వెంకట్రావు వర్ధంతి



కాగిత వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

బంటుమిల్లి: పెడన మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు 4వ వర్ధంతిని టీడీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణప్రసాదు వెంకట్రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కాగిత చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ప్రారంభించి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.వీరబాబు, డీసీ చైర్మన్ బి.కాశీ విశ్వేశ్వరరావు, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు ఆర్.సత్యన్నారాయణ, జె.కిరణ్‌గుప్త మండల పరిధిలోని పలు గ్రామాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవానీ అమ్మవారి నెల జాతర



గంగాభవానీ అమ్మవారి మూలమూర్తికి పూజలు చేస్తున్న అర్చకుడు

కోడూరు: భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి నెల జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం అమ్మవారి ప్రధాన గుడి సంబరం నిర్వహించిన నెల రోజులకు మళ్లీ జాతర నిర్వహించారు. ఉదయం ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు దంపతులు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, గాజులను సమర్పించారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామ మహిళలు నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. మెడలో గారెల దండలు ధరించి చలువ బట్టలపై వచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయాన్ని వివిధ రకాల పుష్ప పరిమళాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ధర్మకర్త యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించగా, ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పోస్టుమాన్, కొరియర్ బాయ్‌లకు టోపీల పంపిణీ

ప్రభుత్వ నేత్ర వైద్యుడు భానుమూర్తి ఔదార్యం



పోస్టుమాన్‌లకు టోపీలు అందజేస్తున్న డాక్టర్ భానుమూర్తి

మచిలీపట్నంటౌన్: రోజురోజుకూ పెరిగిపోతున్న భానుడి ప్రతాపం నుంచి రక్షణ కల్పించేందుకుగాను నగరంలోని పోస్టుమాన్‌లు, కొరియర్‌బాయ్‌లకు జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్, నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ జి.భానుమూర్తి మంగళవారం వారికి టోపీలను అందజేశారు. నగరంలోని చిలకలపూడి పోస్టాఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన 100 టోపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్ అధికారులు డాక్టర్ భానుమూర్తిని అభినందించారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహ ఆవిష్కరణ



మచిలీపట్నంఅర్బన్: మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నైటింగేల్ సేవలను మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డి.ఆశాలత, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న డ్రయిన్లు



మచిలీపట్నంటౌన్: నగరంలోని కోటతుళ్లవారి సెంటర్ వద్ద పోర్టురోడ్డులో డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. ఆ సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వైపు వెళ్లే రోడ్డులో ఉన్న డ్రెయిన్‌లలోని మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో అటుగా ప్రయాణిస్తున్న పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు ఇప్పటికైనా ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్లాన్ అప్రూవల్‌పై అభ్యంతరాలుంటే తెలియజేయండి



ప్లానింగ్ అప్రూవల్ నోటిఫికేషన్‌ను చూపుతున్న టీపీవో సుగుణకుమారి తదితరులు

పెడన: పట్టణ పరిధిలో 10వ వార్డులోని తూర్పు తెలుగుపాలెం, రాజీవ్ నగర్ కాలనీలో కొంత భాగాలను మున్సిపల్ ప్లాన్ అప్రూవల్ కోసం ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారని టీపీవో బి.సుగుణకుమారి తెలిపారు. ఈ నోటిఫికేషన్‌ను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో పెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవో ఎంఎస్ నంబర్ 119 మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఏపీ బిల్డింగ్ రూల్స్ ప్రకారం 10వ వార్డు పరిధిలోని తూర్పు తెలుగుపాలెంలోని కొంత భాగం, రాజీవ్‌నగర్‌లోని కొంత భాగాలను సర్క్యులేషన్ ప్యాటర్న్‌ను రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రాజమహేంద్రవరం రీజియన్ వారిచే అప్రూవల్ అయి నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న రోడ్ల విస్తరణకు సంబంధించి, భవన నిర్మాణాలకు సంబంధించి అప్రూవల్ కోసం జారీ అయిన ఈ సదరు నోటిఫికేషన్‌పై ఏమైనా అభ్యంతరాలుంటే పెడన మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా లేదా ఈ మెయిల్ ద్వారా ఏడు రోజుల్లో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయాలకు చెందిన ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పదవికి వన్నె తేవాలి

- వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కిట్టు
- గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గాజుల భగవాన్‌కు సత్కారం



గాజుల భగవాన్‌ను సత్కరిస్తున్న పేర్ని కిట్టు, వైఎస్సార్ సీపీ నాయకులు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్‌సీపీలో పదవులు పొందిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వారి పదవులకు వన్నె తేవాలని ఆ పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. నగరానికి చెందిన పార్టీ నాయకుడు గాజుల భగవాన్‌ను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ నేపథ్యంలో భగవాన్‌ను పార్టీ 13వ డివిజన్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పేర్ని కిట్టు భగవాన్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేలా నాయకులు కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూరగ రామారావు, తూము లక్ష్మణరావు, బుర్రా రాజా, బొడ్డు తులసీరామ్, కోలా లీలాప్రసాద్, ముచ్చర్ల రాజు, భోగిరెడ్డి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటవిడుపుగా వేసవి శిబిరాలు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు



కొడాలి గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. నగరంలోని పోర్టురోడ్డులో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో లైబ్రేరియన్ వై.జయలక్ష్మి తొలుత విద్యార్థులతో సరస్వతి పూజ చేయించారు. ఆ తర్వాత క్యారమ్స్, లూడో ఆటలు ఆడించారు. కంప్యూటర్ బేసిక్స్‌ను నేర్పించారు. ఇంగ్లిషు టీచర్ టి.స్రవంతి స్పోకెన్ ఇంగ్లిషు క్లాస్ చెప్పారు. కార్యక్రమాన్ని ఉపగ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు. చింతగుంటపాలెం, హౌసింగ్‌బోర్డు కాలనీల్లోని శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు దేశ భక్తిగీతాలు నేర్పించారు. లైబ్రేరియన్‌లు నాగరవి, విజయలక్ష్మి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జ్ఞాన సముపార్జనకే వేసవి శిబిరాలు

కొడాలి(ఘంటసాల): విద్యార్థులకు విజ్ఞానం అందివ్వడం కోసమే గ్రంథాలయాల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నట్లు కొడాలి, ఘంటసాల గ్రంథాలయాల అధికారులు ఎం.సుబ్బారావు, ఎం.శరత్‌కుమార్ తెలిపారు. ఘంటసాల మండలంలోని కొడాలి, ఘంటసాల గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడాలిలో ఉపాధ్యాయులు కొల్లూరి బసవరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా, ఘంటసాల గ్రంథాలయంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

పులిగడ్డ సర్పంచ్‌కు సన్మానం



పులిగడ్డ సర్పంచ్‌ని సత్కరిస్తున్న ఈవో, వైస్ ఎంపీపీ, ఉపసర్పంచ్

పులిగడ్డ(అవనిగడ్డ): సోషల్ సర్వీస్ విభాగంలో డాక్టరేట్ పొందిన పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్‌ని మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ పాలకవర్గం, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈవో అనిత మాట్లాడుతూ కోవిడ్, వరదల సమయంలో విశిష్ట సేవలు అందించినందుకు సర్పంచ్ విజయ్‌కుమార్‌కు డాక్టరేట్ రావడం అందరికీ గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వైస్ సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగరాజ కృతి వైభవాన్ని చాటిన సంకీర్తనలు

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన కచేరీలు త్యాగరాజ స్వామి కృతి వైభవాన్ని చాటాయి. బుర్రా సాయి కార్తీక్ కచేరీతో సంగీత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చిదంబరి, మౌనిక శ్రీవల్లి, రమాభగవాన్, జీవీఆర్ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థినులు గాత్రంతో అలరించారు. సుసుర్ల నందినీశ్రీనివాస్, శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి విద్యార్థులు, రంజని బృందం, ఎంబీవీటీ సుందరి వీణతోనూ త్యాగరాజ స్వామి కృతులను పలికించారు. మంగళవారం జరిగే సంగీత ఉత్సవంలో చింతలపాటి శ్రీదేవి, మల్లాది అనన్య, మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్ తదితరులు పాల్గొంటారు.

తాగరా..తాగరా..తాగి ఊగరా!

- ఇష్టారాజ్యంగా పోతేపల్లి వైన్‌షాపు నిర్వాహకుల వ్యవహారం
- మద్యం విక్రయాలతో పాటు అక్కడే సిట్టింగ్‌లు
- మందుబాబుల ఆగడాలతో బెంబేలెత్తిపోతున్న స్థానికులు
- నిర్వాహకులకు కూటమి పార్టీ అండదండలు ఉండటంతో పట్టించుకోని అధికారులు



పోతేపల్లి వైన్‌షాపు ప్రాంగణంలో మద్యం తాగుతున్న మందుబాబులు (ఫైల్)

కోనేరుసెంటర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీ ప్రకారం ఆ పార్టీలకు చెందిన నాయకులే అత్యధికంగా వైన్‌షాపులను దక్కించుకున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వ పెత్తనాన్ని అడ్డం పెట్టుకుని వైన్‌షాపు యజమానులు కొందరు ఎక్సైజ్ నిబంధనలను తుంగలో తొక్కి వ్యాపారాలు సాగిస్తుండటం, అలాంటి షాపులపై ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. మచిలీపట్నం మండలం పోతేపల్లి పంచాయతీ పరిధిలో జ్యూయలరీ పార్కుకు ఎదురుగా ఈ వైన్‌షాపును నిర్వాహకులు నడుపుతున్నారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం వైన్‌షాపులను గుడి, బడులతో పాటు గృహాలకు దూరంగా పెట్టుకోవాల్సి ఉంది. అయితే ఈ షాపు యజమాని ఏకంగా సుమారు ఏడువందల గడప ఉండే గృహాల మధ్య ఉన్న ఓ రేకుల షెడ్డులో పెట్టి అమ్మకాలు జరుపుతున్నాడు. అంతేకాకుండా చుట్టూ పరదాలను కట్టి మందుబాబులకు అక్కడే సిట్టింగ్ ఏర్పాట్లు చేసి మద్యం తాగే వెసులుబాటు కల్పించాడు. దీంతో చుట్టుపక్కల నివసించే కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడపాదడపా మందుబాబులు మందు ఎక్కువై వారిలో వారు ఘర్షణలు పడి పెద్దపెద్దగా అరుచుకుంటూ, గొడవలు పడుతుండటంతో ఆ ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురై తలుపులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

ఇళ్ల మధ్య వద్దంటూ గతంలోనే మహిళల ఫిర్యాదు

ఆ ప్రాంతంలోని గృహాల మధ్య వైన్‌షాపు పెడుతున్నట్లు తెలుసుకున్న స్థానిక కుటుంబాల మహిళలు తమ ఇళ్ల మధ్య వైన్‌షాపు పెట్టటానికి ఒప్పుకోమంటూ ఎక్సైజ్ అధికారులకు మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎక్సైజ్ అధికారులు అక్కడ వైన్‌షాపు పెట్టనీయబోమంటూ మహిళలకు భరోసా ఇచ్చారు. కాని ఆ హామీని విస్మరించి వైన్‌షాపు యజమానికి లైసెన్స్ ఇచ్చేశారు. ఈ విషయం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారం అండదండలుండటంతో వైన్‌షాపు నిర్వాహకులు మరింత రెచ్చిపోయి నిబంధనలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారంటూ మండిపడుతున్నారు.

గృహాల్లోకి సీసీ కెమెరాలు పెట్టి...

వైన్‌షాపును ఇళ్ల మధ్య నుంచి తొలగించాలంటూ అనేక కుటుంబాలు పోరాటం చేస్తున్నాయి. మందుబాబులు వైన్‌షాపు ప్రాంగణంలోనే మద్యం తాగి వీరంగం ఆడుతుండటంతో స్థానికంగా ఉన్న కొందరు ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో వీడియోలు తీస్తూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో వైన్‌షాపు నిర్వాహకులు దుకాణానికి సీసీ కెమెరాలను పెట్టించి ఆ కెమెరాలను వీడియోలు తీసే వ్యక్తుల గృహాల వైపు తిప్పి మరీ అక్కడ ఎవరు వీడియోలు తీస్తున్నదీ పరిశీలించి బెదిరింపులకు గురి చేస్తున్నారంటూ పలువురు చెబుతున్నారు. వైన్‌షాపు వద్ద మందుబాబుల ఆగడాలు ఎక్కువైపోవడంతో భరించలేని బాధిత కుటుంబాలు ఈ నెల 27వ తేదీన మచిలీపట్నం విచ్చేసిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను స్వయంగా కలిసి మొరపెట్టుకున్నారు.

సుల్తానగరంలో ఎక్సైజ్ దాడులు

కోనేరుసెంటర్: బందరు మండలం సుల్తానగరంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం బెల్టుషాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన మోతుకూరి నాగబాబు అనే బడ్డీ వ్యాపారి వద్ద 10 ఎన్‌డీపీఎల్ (నాన్‌డ్యూటీపెయిడ్‌లిక్కర్) బీర్ బాటిళ్లను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ ఎం.రవి తెలిపారు.